



వైఎస్సార్‌ సీపీ ఉత్తర కార్యాలయం వద్ద, అశోక్‌నగర్‌లోని వైఎస్సార్‌ సీపీ దక్షిణ కార్యాలయం వద్ద సంబరాలు



నోటిఫికేషన్‌	: ఏప్రిల్‌ 18వ తేదీ
నామినేషన్ల స్వీకరణ	: ఏప్రిల్‌ 18 నుంచి 25
నామినేషన్ల పరిశీలన	: ఏప్రిల్‌ 26 నుంచి
నామినేషన్ల ఉపసంహరణ	: ఏప్రిల్‌ 29
పోలింగ్‌	: మే 13
ఓట్ల లెక్కింపు	: జూన్‌ 4వ తేదీ

సమరానికి సై

- మోగిన ఎన్నికల నగారా
- అమల్లోకి ఎన్నికల కోడ్‌

విశాఖ జిల్లాలో మొత్తం

పోలింగ్‌ స్టేషన్లు	1991
మొత్తం ఓటర్లు	19,71,268
పురుషులు	9,72,899
మహిళలు	9,98,251
ఇతరులు	118

సాక్షి, విశాఖపట్నం : సార్వత్రిక ఎన్నికల నగారా మోగింది. పార్లమెంటుతో పాటు రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం శని వారం మధ్యాహ్నం విడుదల చేసింది. ఏడు విడతల్లో ఎన్నికలు జరగనుండగా ఈసారి నాలుగో విడతలో ఏపీలో పార్లమెంటు స్థానాలతో పాటు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకోసం ఏప్రిల్‌ 18న నోటిఫికేషన్‌ నోటిఫికేషన్‌ విడుదల కానుందని జిల్లా కలెక్టర్‌ డా.మల్లికార్జున తెలిపారు. నగర పోలీస్‌ కమిషనర్‌ డా.రవిశంకర్‌ అయ్యర్‌, జీవీఎంసీ కమిషనర్‌ సీఎం సాయికాంత్‌ వర్మ, జాయింట్‌ కలెక్టర్‌ మయూర్‌ అశోక్‌, డీఆర్‌వో మోహన్‌కుమార్‌తో కలిసి ఎన్నికల షెడ్యూల్‌ను కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌ హాల్‌లో శని వారం నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్ల డించారు. ఎన్నికల షెడ్యూల్‌ విడుదల కావడంతో ఎన్నికల కోడ్‌ పూర్తి స్థాయిలో అమలులోకి వచ్చిందని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో సచివాలయాల పరిధిలో సేవలందిస్తున్న గ్రామ, వార్డు వలంటీర్లు ఎన్నికల సంబంధిత కార్యకలాపాల్లో పాల్గొనకూడదని కలెక్టర్‌ స్పష్టం చేశారు. ఏ అభ్యర్థికీ పోలింగ్‌ ఏజెంట్‌గా కూడా వ్యవహరించకూడదని.. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్‌ మల్లికార్జున, సీపీ రవిశంకర్‌, జీవీఎంసీ కమిషనర్‌ సాయికాంత్‌వర్మ, జేసీ మయూర్‌ అశోక్‌, డీఆర్‌వో మోహన్‌కుమార్‌

సింగిల్‌ విండో పద్ధతిలో...

ఎన్నికల ప్రవర్తన నియామవళిని అమలు చేసేందుకు 18 ఎంసీసీ బృందాలు, 23 ఫ్లయింగ్‌ స్క్వాడ్స్‌, 18 వీఎస్‌టీ బృందాలు చొప్పున మొత్తం 59 ఏర్పాటు చేశాం. మొత్తం 14,335 మంది ఉద్యోగులు ఎన్నికల విధుల్లో ఉంటారు. ప్రచారానికి, నామినేషన్లకు సంబంధించి ఏవైనా అనుమతులు కావాలంటే సింగిల్‌ విండో సిస్టమ్‌ ద్వారా ఇస్తున్నాం. ఎస్‌సీ కార్పొరేషన్‌ ఈడీ నోడల్‌ అధికారిగా ఉండే ఈ సింగిల్‌ విండోలో రవాణా, పోలీస్‌, ఎక్సైజ్‌ శాఖతో పాటు ఇతర విభాగాలకు చెందిన అధికారులుంటారు. కలెక్టరేట్‌లో మీడియా సెల్‌, సోషల్‌ మీడియా సెల్‌ కూడా ఏర్పాటు చేస్తున్నాం. నామినేషన్ల ఉపసంహరణకు 10 రోజులకు ముందు వరకూ కొత్త ఓటర్ల నమోదుకు ఫారం-6 దరఖాస్తులు తీసుకుంటాం.

– డా.మల్లికార్జున, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌

సువిధ యాప్‌ ద్వారానే అనుమతులు

ఎన్నికలు పకడ్బందీగా.. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. రాజకీయ పార్టీలు ప్రచారానికి, సభలకు సువిధ యాప్‌ ద్వారా దరఖాస్తు చేసుకుంటే అనుమతులు ఇస్తాం. రాజకీయ నాయకుల వద్ద ఏవైనా ఆయుధాలు ఉంటే డిపాజిట్‌ చేయాలి. ప్రస్తుతం 6 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. భవిష్యత్తులో మరిన్ని పెంచుతాం. 478 పోలింగ్‌ స్టేషన్లను స్వల్ప సమస్యాత్మకంగా గుర్తించాం. ప్రతి నియోజకవర్గానికి రెండు స్టాటిక్‌ సర్వైలెన్స్‌ బృందాల్ని ఏర్పాటు చేశాం.

– డా.రవిశంకర్‌ అయ్యర్‌, నగర పోలీస్‌ కమిషనర్‌

నియోజకవర్గం: భీమిలి
అభ్యర్థి: ముత్తంశెట్టి శ్రీనివాసరావు



తండ్రి: వెంకట నారాయణ
భార్య: ముత్తంశెట్టి జ్ఞానేశ్వరి
సంతానం: ప్రియాంక, వెంకట శివనందీష్‌
చదువు: డిగ్రీ
2009–2014 వరకు భీమిలి ఎమ్మెల్యేగా, 2014–2019 వరకు అనకాపల్లి ఎంపీగా పనిచేశారు. 2019లో వైఎస్సార్‌ సీపీ నుంచి భీమిలి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2019 నుంచి 2022 వరకు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రిగా పనిచేశారు.

జగన్‌కు కానుకగా ఇస్తా..

తగరపువలస: వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆశీస్సులు, ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో మరోసారి భీమిలి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నా.. రెండో సారి ఇక్కడ పోటీ చేసే అవకాశం కల్పించిన ఆయనకు ధన్యవాదాలు. సీఎం జగన్‌ నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా ఇక్కడి ప్రజల సహకారంతో గెలిచి ఆయనకు కానుకగా ఇస్తా. ఒబెరాయ్‌ వంటి సెవెన్‌ స్టార్‌ హోటళ్ల నిర్మాణం ద్వారా భీమిలిని ప్రపంచపటంలో చేర్చిన ఘనత సీఎందే. ఐదేళ్ల కాలంలో ఎన్నో మంచి కార్యక్రమాలు చేసే విధంగా భగవంతుడు వైఎస్‌ జగన్‌ ద్వారా అవకాశం కల్పించారు. నన్ను ఎంతగానో ఆదరిస్తున్న భీమిలి ప్రజలకు నేను చేయాల్సింది ఇంకా చాలా ఉంది.

నియోజకవర్గం : విశాఖ పార్లమెంట్‌
అభ్యర్థి: బొత్స ఝాన్సీ లక్ష్మి



విద్యార్హత: ఎంఏ ఫిలాసఫీ, ఎల్‌ఎల్‌బీ, న్యాయ విద్యలో రెండు పీహెచ్‌డీలు
భర్త: బొత్స సత్యనారాయణ
సంతానం : డాక్టర్‌ బొత్స సందీప్‌, అనూష
2001 నుంచి 2006 వరకు విజయనగరం జిల్లా పరిషత్‌ చైర్‌పర్సన్‌గా పని చేశారు. 2007 ఉప ఎన్నికల్లో బొబ్బిలి ఎంపీగా ఎన్నికయ్యారు. 2009లో విజయనగరం ఎంపీగా రెండోసారి గెలుపొందారు.

వైఎస్సార్‌సీపీలో ఫుల్‌జోష్‌

సార్వత్రిక ఎన్నికలకు వైఎస్సార్‌ సీపీ సర్వసన్నద్ధమైంది. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను శనివారం ప్రకటించింది. సామాజిక సమీకరణాల ఆధారంగా విశాఖ జిల్లాలో అభ్యర్థులను ఎంపిక చేసింది. ఈ జాబితాపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఎన్నికల్లో పోటీకి అవకాశం కల్పించిన పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి అభ్యర్థులు కృతజ్ఞతలు తెలిపారు.

నియోజకవర్గం: విశాఖ ఉత్తర
అభ్యర్థి: కమ్మిల కన్నపరాజు(కె.కె.రాజు)



తల్లిదండ్రులు: కోదండరామరాజు, అచ్చుతం
భార్య: సుమ, సంతానం, కుమార్తెలు: సాత్విక, హన్సిక
చదువు: డిగ్రీ
22 ఏళ్ల కిందట విశాఖ నగరానికి వచ్చిన కె.కె.రాజు 17 ఏళ్ల కిందట సిరి వెంకటేశ్వర డెవలపర్స్‌ సంస్థను స్థాపించారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విశాఖ లోక్‌సభ అభ్యర్థిగా వైఎస్‌ విజయమ్మ పోటీ చేసిన నేపథ్యంలో.. పార్టీపై అభిమానంతో పనిచేశారు. 2018లో పార్టీ ఉత్తర సమన్వయకర్తగా నియమితులయ్యారు. 2019లో వైఎస్సార్‌ సీపీ తరఫున పోటీ చేశారు. నెడ్‌క్యాప్‌ చైర్మన్‌గా పనిచేశారు.

ఇది నాకు పునర్జన్మ

సీతమ్మధార: విశాఖ ఉత్తర నియోజకవర్గం ఐక్యత, క్రమశిక్షణకు మారుపేరు. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి నాకు రాజకీయ జన్మనిచ్చి 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్‌ ఇచ్చారు. 2024 ఎన్నికల్లో రెండోసారి టికెట్‌ ఇచ్చి నాకు పునర్జన్మనిచ్చారు. ఐదేళ్లలో గడపగడపకూ అందించిన సంక్షేమం, చేపట్టిన అభివృద్ధి నా గెలుపునకు మొదటి బలం. నియోజకవర్గ ప్రజలకు నేను, అన్ని వార్డుల కార్పొరేటర్లు నిత్యం అందుబాటులో ఉండి.. కుల, మత, రాజకీయాలకు అతీతంగా 25 ఏళ్లుగా ఉన్న దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాం. ఇది నా రెండవ బలం. నియోజకవర్గంలోని అన్ని వార్డులను రూ.435 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేశాను.

నియోజకవర్గం: విశాఖ పశ్చిమ
అభ్యర్థి: ఆడారి ఆనంద్‌కుమార్‌



తండ్రి: ఆడారి తులసీరావు
భార్య: మాలతి,
సంతానం: కుమార్తె
చదువు: డిగ్రీ
2014లో యలమంచిలి కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. 2019లో అనకాపల్లి ఎంపీగా పోటీ చేశారు. విశాఖ డెయిరీ ట్రస్ట్‌ సీఈవోగా పనిచేశారు. ప్రస్తుతం విశాఖ డెయిరీ ట్రస్ట్‌ చైర్మన్‌గా ఉన్నారు.

ప్రజలకు మరింత సేవ చేస్తా ..

గోపాలపట్నం: పశ్చిమ అభ్యర్థిగా నన్ను ప్రకటించడం చాలా సంతోషంగా ఉంది. వైఎస్సార్‌ సీపీ పశ్చిమ సమన్వయకర్తగా ప్రజలకు ఎంతో దగ్గరయ్యా. గడపగడపకు మన ప్రభుత్వంలో ప్రతీ ఇంటికి వెళ్లి ప్రజలను కలిసి వారి అభిమానం పొందాను. ప్రజలు నా దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించడం ఎంతో సంతృప్తినిచ్చింది. ట్రస్ట్‌ ద్వారా కంటి, గుండె వైద్య శిబిరాలు నిర్వహించి ఆపరేషన్లు చేయించాను. సాంకేతిక కారణాల వల్ల పింఛన్‌ రాని వారికి సొంత నిధులతో పింఛన్లు అందించాను. ప్రజాబలం, పార్టీ నాయకులు, కార్యకర్తల సమష్టి కృషితో ఎమ్మెల్యేగా గెలిచి ప్రజలకు మరింత సేవ చేస్తాను.

నియోజకవర్గం: గాజువాక
అభ్యర్థి: గుడివాడ అమర్‌నాథ్‌



తల్లిదండ్రులు: గుర్నాథరావు, నాగమణి
భార్య: హిమగౌరి,
సంతానం: ఇద్దరు కుమార్తెలు
చదువు: బీటెక్‌
ప్రస్తుతం రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రిగా ఉన్న గుడివాడ అమర్‌నాథ్‌ 2006లో బి.టెక్‌ పూర్తి చేశారు. 2007లో జరిగిన జీవీఎంసీ ఎన్నికల్లో జీవీఎంసీ 65వ వార్డు నుంచి కార్పొరేటర్‌గా గెలుపొందారు. 2014 సాధారణ ఎన్నికల్లో అనకాపల్లి పార్లమెంట్‌ స్థానానికి వైఎస్సార్‌ సీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. 2019 ఎన్నికల్లో అనకాపల్లి ఎమ్మెల్యేగా వైఎస్సార్‌ సీపీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు.

నియోజకవర్గం: విశాఖ తూర్పు
అభ్యర్థి: ఎంవీవీ సత్యనారాయణ



తల్లిదండ్రులు: రఘునాయకులు, పార్వత వర్ధనమ్మ
భార్య: నాగజ్యోతి
సంతానం: శరత్‌ చౌదరి
చదువు: ఎం.ఏ(ఏయూ, విశాఖపట్నం), (పీహెచ్‌డీ-ఏయూ)
2018లో రాజకీయం రంగంలోకి ప్రవేశించి వైఎస్సార్‌ సీపీలో చేరారు. 2019లో విశాఖ ఎంపీగా పోటీ చేసి విజయం సాధించారు.

తూర్పులో ఎగిరేది వైఎస్సార్‌ సీపీ జెండానే..

ఆరిలోవ: విశాఖ తూర్పులో ఈసారి వైఎస్సార్‌ సీపీ జెండా ఎగురవేస్తాం. తనపై నమ్మకంతో టికెట్‌ కేటాయించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. నియోజకవర్గంలో పార్టీ క్యాడర్‌ బాగా పనిచేస్తోంది. మరింత సమన్వయంతో పనిచేసి అత్యధిక ఓట్లతో విజయకేతనం ఎగురవేసి.. సీఎం జగన్‌కు కానుకగా అందిస్తాను. ఐదేళ్లలో నియోజకవర్గంలో వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా అర్హులంతా లబ్ధిపొందారు. వారంతా జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని బలంగా కోరుకుంటున్నారు.

నియోజకవర్గం : పెందుర్తి
అభ్యర్థి: అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌



తల్లిదండ్రులు: సత్యనారాయణ, రామలక్ష్మి, భార్య: శిరీష,
సంతానం : సత్య ధన్విత్‌ రాజ్‌
రాంపురం పంచాయతీకి పిన్న వయసులోనే సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. జిల్లా యూత్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడిగా సేవలందించారు. 2015లో పెందుర్తి నియోజకవర్గ వైఎస్సార్‌ సీపీ బాధ్యతలు చేపట్టారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌ సీపీ తరఫున తొలిసారి పోటీ చేసి ఘన విజయం సాధించారు.

జగన్‌ నమ్మకాన్ని నిలబెడతా..

పెందుర్తి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో మళ్లీ ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. ఐదేళ్ల పాటు సీఎం జగన్‌ అందించిన సంక్షేమం, అభివృద్ధి, ప్రజలకు నేను చేసిన సేవలే నన్ను గెలిపిస్తాయి. పెందుర్తి ప్రజలకు రానున్న ఐదేళ్ల పాటు సేవ చేసేందుకు సిద్ధమవుతున్నాను. ప్రత్యర్థులు ఎంత మంది కలిసి వచ్చినా సీఎం జగన్‌ చరిష్మా ముందు వారు నిలబడలేరు. ఈ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచి సీఎం నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను. సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు.

నియోజకవర్గం: విశాఖ దక్షిణ
అభ్యర్థి: వాసుపల్లి గణేష్‌ కుమార్‌



భార్య: ఉషారాణి
సంతానం: సూర్య, గోవింద్‌ సాకేత్‌
చదువు: రిటైర్డ్‌ ఫ్లైట్‌ లెఫ్టినెంట్‌, ఐఏఎఫ్‌, బీఈ, ఏఈ, ఐఐఎఫ్‌టీ
2009లో ఎమ్మెల్యేగా పోటీ చేశారు. 2014, 2019లో ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు. డయల్‌ యువర్‌ ఎమ్మెల్యే, ప్రజా దర్బార్‌ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

నాకు టికెట్‌ కేటాయించిన ముఖ్యమంత్రిగా వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు. నియోజకవర్గంలో వైఎస్సార్‌ సీపీ జెండా ఎగరడం ఖాయం. ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందాయి. ఎంతో మంది సీఎం రిలీఫ్‌ ఫండ్‌ ద్వారా లబ్ధిపొందారు. పేదలంటే ఎంతో ప్రేమ ఉన్న ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన అవసరం రాష్ట్ర ప్రజలకు ఎంతైనా ఉంది.

మార్చి 16 నాటికి ఓటర్ల జాబితా

అసెంబ్లీ	పురుషులు	మహిళలు	థర్డ్‌ జెండర్‌	మొత్తం	సర్వీస్‌ ఓటర్లు	ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు
భీమిలి	1,74,877	1,81,589	15	3,56,481	1266	53
విశాఖ తూర్పు	1,38,387	1,45,192	19	2,83,601	234	131
విశాఖ దక్షిణ	1,04,488	1,08,264	31	2,12,783	200	57
విశాఖ ఉత్తర	1,37,515	1,41,290	20	2,78,825	225	179
విశాఖ పశ్చిమ	1,03,248	1,06,166	10	2,09,424	465	43
గాజువాక	1,64,101	1,63,325	12	3,27,438	766	227
పెందుర్తి	1,50,257	1,52,454	5	3,02,716	469	14

ఎన్నికల విధుల్లో అప్రమత్తత అవసరం

కలెక్టర్‌ డాక్టర్‌ మల్లికార్జున

మహారాణిపేట: ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్‌ ఎ.మల్లికార్జున అధికారులకు సూచించారు. సాధారణ ఎన్నికలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ సంస్థల మానవ వనరుల వినియోగంపై వివిధ కేంద్ర సంస్థల అధికారులతో కలెక్టరేట్‌ వీడియో కాన్ఫరెన్స్‌ హాల్లో జీవీఎంసీ కమిషనర్‌ సాయికాంత్‌ వర్మతో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ విభాగాల నుంచి వివిధ కేటగిరీల్లో అధికారులు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నందున జాగ్రత్తగా విధులు నిర్వహించాలన్నారు. ఉద్యోగులెవరూ ఎన్నికల ప్రచార కార్యక్రమాలలో ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని పాల్గొనరాదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల అతిథి గృహాలను రాజకీయ నాయకులకు, కార్యక్రమాలకు కేటాయించరాదని చెప్పారు. ఈవీఎంల నిర్వహణ తదితర అంశాలపై పీవో, ఏపీవో, ఓపీవో, మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ ఇస్తామన్నారు. మొదటి, రెండో ర్యాండమైజేషన్‌ ప్రక్రియ తర్వాత ఉద్యోగులకు తమ పోలింగ్‌ స్టేషన్‌ వివరాలు, తమతో ఉండే సిబ్బంది వివరాలు తెలియజేస్తామన్నారు. ఏ చిన్న అంశం వదిలిపెట్టకుండా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి అధికారులు నడుచుకోవాలన్నారు. జీవీఎంసీ కమిషనర్‌ మాట్లాడుతూ మోడల్‌ కోడ్‌ ఆఫ్‌ కాంటాక్ట్‌ అమల్లోకి వచ్చిందన్నారు. ప్రతీ సంస్థ తమ కార్యాలయ ఆవరణలో రాజకీయ నాయకులకు సంబంధించిన ఫొటోలు, బ్యానర్లు, పోస్టర్లు, హోర్డింగ్స్‌ తక్షణమే తొలగించాలని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరూ రాజకీయ పార్టీల ప్రచారంలో పాల్గొనరాదన్నారు. డీఆర్వో కె.మోహన్‌కుమార్‌ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియపై అధికారులకు శిక్షణ

మహారాణిపేట: ఎన్నికల ప్రక్రియ, నిబంధనలపై అధికారులందరూ సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జేసీ కె.మయూర్‌ అశోక్‌ సూచించారు. తూర్పు నియోజకవర్గ పరిధి సెక్టోరల్‌, రూట్‌, పోలింగ్‌ అధికారులకు సూర్యాబాగ్‌ జోన్‌-4 కార్యాలయంలో శనివారం నిర్వహించిన శిక్షణ సదస్సులో ఆయన మాట్లాడారు. ఈసీ నిబంధనలను ఎప్పటికప్పుడు ఫాలో అవుతూ ఉండాలని, ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా తెలుసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఎలాంటి సందేహాలు, సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారంలో సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు.

ముత్తంశెట్టి ఎన్నికల ప్రచారం ప్రారంభం

తగరపువలస: వైఎస్సార్ సీపీ భీమిలి అసెంబ్లీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు శనివారం ఎన్నికల శంఖారావం పూరించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులుతో కలిసి అన్నవరం పంచాయతీ నుంచి ప్రచారం ప్రారంభించారు. ముందుగా సంగివలస ముగ్గురు అమ్మవార్ల ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, వేలాది మందితో ర్యాలీగా అన్నవరం తీర ప్రాంతానికి చేరుకున్నారు. ఎర్రయ్యపాలెంలో రామాలయం, గ్రామ దేవతలకు పూజలు చేపట్టారు. అనంతరం తీరంలో గంగమ్మ తల్లికి పూజలు చేశారు. భీమిలి ప్రజల సహకారంతో మరోమారు గెలిచి సీఎం జగన్‌కు కానుకగా అందిస్తానన్నారు.



ఎర్రయ్యపాలెం తీరంలో గంగమ్మకు పూజలు చేస్తున్న ముత్తంశెట్టి,గురువులు

బీసీలకు అగ్రపీఠం

- వైఎస్సార్ సీపీ అభ్యర్థుల ఎంపికలో సామాజిక సమన్యాయం
- ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పెద్దపీట
- బీసీ మహిళకు తొలిసారి విశాఖ పార్లమెంట్ సీటు కేటాయింపు
- ఉమ్మడి విశాఖలో ఏడుగురు బీసీలకు ఎమ్మెల్యే అభ్యర్థులుగా అవకాశం
- మూడు స్థానాలను ఎస్టీలకు, ఓ స్థానాన్ని ఎస్సీ వర్గానికి కేటాయింపు
- విశాఖ ఎంపీ, అరకు ఎంపీ అభ్యర్థులు మహిళలే
- కొత్తగా నలుగురికి చాన్స్

సామాజిక వర్గాల వారీగా ఉమ్మడి విశాఖ జిల్లాలో అసెంబ్లీ అభ్యర్థులు

బీసీలు: 7 (తూర్పు కాపు-2, కొప్పుల వెలమ-3, గవర-1, మత్స్యకార-1)	ఓసీ కాపు	క్షత్రియ	కమ్మ	ఎస్సీ	ఎస్టీలు
7	2	2	1	1	3

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ బీసీల పక్షపాతి అని మరోసారి నిరూపించుకుంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో 16 అసెంబ్లీ స్థానాల్లో 7 గురు బీసీ అభ్యర్థులకు అవకాశం కల్పించింది. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా ఐదేళ్ల పాటు సంక్షేమం, అభివృద్ధి చేసి పేద ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. 2019 ఎన్నికల మాదిరి మరోమారు రాష్ట్రంలో అన్ని అసెంబ్లీ, 24 పార్లమెంట్ స్థానాలకు ఒకేసారి అభ్యర్థులను ప్రకటించారు. ప్రత్యర్థి పార్టీల అంచనాలను తలకిందులు చేస్తూ అత్యంత ప్రజాదరణ కలిన అభ్యర్థులను ఎన్నికల బరిలోకి దించారు.

ఉమ్మడి విశాఖ జిల్లా(రంపచోడవరంతో కలిపి) రెండు లోక్‌సభ స్థానాలతో పాటు 16 అసెంబ్లీ స్థానాలకు శనివారం ప్రకటించిన జాబితాలోనే అభ్యర్థులను ఖరారు చేశారు. సామాజికవర్గాల సమతూకం పాటిస్తూ జరిగిన అభ్యర్థుల ఎంపిక వైఎస్సార్ సీపీలో జోష్‌ను నింపింది. మరీ ముఖ్యంగా అభ్యర్థుల ఎంపికలో జిల్లాలో మెజార్టీ సామాజిక వర్గాలైన బీసీలకు అగ్రపీఠం వేశారు. విశాఖ పార్లమెంట్ స్థానాన్ని ఎన్నడూ లేని విధంగా తొలిసారిగా బీసీ(మహిళ)కు కేటాయించారు. అలాగే ఏడుగురు బీసీ అభ్యర్థులకు సీట్లు కేటాయించారు. వీరిలో తూర్పు కాపు నుంచి ఇద్దరు, కొప్పుల వెలమ ముగ్గురు, గవర ఒకరు, మత్స్యకారుల నుంచి ఒకరు ఉన్నారు. ఎస్సీ నుంచి ఒకరు, ఎస్టీలు ముగ్గురు ఉన్నారు. అలాగే ఓసీ కాపు నుంచి ఇద్దరు. క్షత్రియ ఇద్దరు, కమ్మ నుంచి ఒకరికి సీట్లు కేటాయించారు.

ఎంపీలుగా ఉన్నత విద్యావంతులైన మహిళలు

విశాఖ, అరకు పార్లమెంట్ స్థానాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నత విద్యావంతులైన మహిళలను ఎంపిక చేశారు. తద్వారా మహిళలకు వైఎస్సార్ సీపీ ఏ స్థాయిలో ప్రాధాన్యతమిస్తుందో చెప్పకనే చెప్పారు. వీరిలో విశాఖ పార్లమెంట్ స్థానం నుంచి బొత్స ఝాన్సీ లక్ష్మి ఎల్ఎల్‌బీ, ఎంఏ(ఫిలాసఫీ), డబుల్ పీహెచ్‌డీ పూర్తి చేశారు. అరకు లోక్‌సభ స్థానం నుంచి ఎంబీబీఎస్ పూర్తి చేసిన తనూజారాణికి అవకాశం కల్పించారు. అలాగే వైఎస్సార్ సీపీ తరపున అరకు లోక్‌సభ స్థానం, పాడేరు, అరకు, అనకాపల్లి అసెంబ్లీ స్థానాలకు కొత్త అభ్యర్థులకు అవకాశం ఇచ్చారు. ఎనిమిది నియోజకవర్గాల్లో సిట్టింగ్‌లకు, విశాఖ నార్త్ నియోజకవర్గంలో 2019లో పోటీ చేసిన వైఎస్సార్ సీపీ సమన్వయ కర్త కె.కె.రాజుకు మళ్లీ అవకాశం కల్పించారు.

వైఎస్సార్ సీపీ లోక్‌సభ అభ్యర్థుల జాబితా

విశాఖ	బొత్స ఝాన్సీలక్ష్మి	తూర్పు కాపు- బీసీ
అరకు	గుమ్మా తనూజారాణి	ఎస్టీ- వాల్మీకి

ఉమ్మడి విశాఖ అసెంబ్లీ అభ్యర్థుల జాబితా

భీమిలి	ముత్తంశెట్టి శ్రీనివాసరావు	ఓసీ-కాపు
విశాఖ తూర్పు	ఎంవీవీ సత్యనారాయణ	ఓసీ-కమ్మ
విశాఖ ఉత్తర	కె.కె రాజు	ఓసీ-క్షత్రియ
గాజువాక	గుడివాడ అమర్‌నాథ్	ఓసీ-కాపు
యలమంచిలి	యు.వి రమణమూర్తిరాజు	ఓసీ-క్షత్రియ
విశాఖ పశ్చిమ	ఆడారి ఆనంద్‌కుమార్	బీసీ-గవర
విశాఖ దక్షిణ	వాసుపల్లి గణేష్‌కుమార్	బీసీ-మత్స్యకార
అనకాపల్లి	మలసాల భరత్‌కుమార్	బీసీ-తూర్పు కాపు
చోడవరం	కరణం ధర్మశ్రీ	బీసీ-తూర్పు కాపు
నర్సీపట్నం	పెట్ల ఉమాశంకర్ గణేష్	బీసీ -కొప్పుల వెలమ
పెందుర్తి	అన్నంరెడ్డి అదీప్‌రాజ్	బీసీ-కొప్పుల వెలమ
మాడుగుల	బూడి ముత్యాలనాయుడు	బీసీ-కొప్పుల వెలమ
పాయకరావుపేట	కంబాల జోగులు	ఎస్సీ
పాడేరు	రేగం మత్స్యలింగం	ఎస్టీ - కొండదొర
అరకు	మత్స్యరాస విశ్వేశ్వరరాజు	ఎస్టీ - భగత
రంపచోడవరం	నాగులాపల్లి ధనలక్ష్మి	ఎస్టీ - కొండదొర

వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ కమిటీ ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ

విశాఖ సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బీసీ విభాగ కమిటీలో విశాఖ చెందిన ఇద్దరికి చోటు కల్పించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పి.సత్యనారాయణ, కార్యదర్శిగా పిల్లా పాపారావు నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాన్ని చేపట్టినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శిగా చిన్నారావు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్టీ విభాగ ప్రధాన కార్యదర్శిగా అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన పంగి చిన్నారావు నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాన్ని చేపట్టినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది.

'కోడ్'తో విగ్రహాలకు ముసుగు



ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు వేస్తున్న సిబ్బంది

విశాఖ సిటీ: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిన మరుక్షణం జీవీఎంసీ పారిశుద్ధ్య విభాగం, పట్టణ ప్రణాళిక అధికారులు, సిబ్బంది నగరవ్యాప్తంగా రహదారుల్లో ఉన్న రాజకీయ నేతల ప్రచార బోర్డులు, ఫ్లెక్సీలు తొలగించారు. ప్రభుత్వ, ప్రైవేటు భవనాలు, బస్‌షెల్టర్లు, బస్టాండ్లు, బస్సులు, పార్కులు, డివైడర్లపై రాసిన రాతల తొలగింపు ప్రక్రియలో నిమగ్నమయ్యారు. అలాగే ప్రధాన జంక్షన్లు, రహదారుల్లో ఉన్న బోర్డులు, ఫ్లెక్సీలు, అతికించిన గోడపత్రికలను తొలగించారు. అలాగే బీచ్ రోడ్డు, సిరిపురంతో పాటు ఇతర ప్రాంతాల్లో ఉన్న రాజీవ్ గాంధీ, వైఎస్సార్, ఎన్టీఆర్ విగ్రహాలకు ముసుగు వేశారు. అలాగే బీచ్ రోడ్డు, సిరిపురం, మద్దిలపాలెం, హనుమంతవాక, ఇతర ప్రాంతాల్లో రాజకీయ పక్షాలకు సంబంధించిన భారీ హోర్డింగ్‌లు సైతం తొలగించారు. అనుమతి లేకుండా ఎటువంటి ప్రచార బోర్డు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినా చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.